సాక్షి
కాకినాడ
శుక్రవారం। 1 । మార్చి । 2024



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు ఇందుకూరి సీతమ్మ (మలికిపురం మండలం గుడిమెళ్లంక) గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు.




ఉజ్వల భవితకు వినూత్న బోధన

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నారు.

8లో

8,970 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.30 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఎంఎస్‌ఎంఈల సర్వే



మురళీధర్

కాకినాడ రూరల్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి 20 రోజుల పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ)పై సర్వే నిర్వహించనున్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి.మురళీధర్ గురువారం ఈ విషయం తెలిపారు. తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లో ఎంఎస్‌ఎంఈల పనితీరును ఈ సర్వే ద్వారా గుర్తించి, ఏపీఎంఎస్‌ఎంఈ-1 పోర్టల్ ద్వారా డిజిటల్ ప్లాట్‌ఫాంలోకి తీసుకురానున్నామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డు ఎమినిటీ సెక్రటరీలు ఈ సర్వే నిర్వహిస్తారని, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్లు సర్వే పురోగతిని పర్యవేక్షిస్తారని చెప్పారు. ఎంఎస్‌ఎంఈల పని తీరును మెరుగుపరిచేదుకు, అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం స్కీమ్ ప్రకటించిందని, ఈ నేపథ్యంలో ఎంఎస్‌ఎంఈ-1 ఏకీకృత పోర్టల్‌ను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఫిబ్రవరి 14న ప్రారంభించారని తెలిపారు. ఈ సర్వే ద్వారా జిల్లాలోని ఎంఎస్‌ఎంఈల డేటాబేస్ అభివృద్ధి చేయడం, వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల నైపుణ్యాలను అభివృద్ధి చేయడం వంటి చర్యలు తీసుకుంటామని వివరించారు. తద్వారా వివిధ ప్రభుత్వ ప్రోత్సాహకాలకు ఎంఎస్‌ఎంఈలు అర్హత పొందడంతో పాటు రుణసదుపాయాలు సులభతరమవుతాయని తెలిపారు. ఈ సర్వేకు సహకరించాలని ఎంఎస్‌ఎంఈ, ఇతర పరిశ్రమల, వర్తక, వాణిజ్య సంఘాలకు మురళీధర్ విజ్ఞప్తి చేశారు.

హారాలు అలంకరించాలి

అన్నవరం: భక్తులు సమర్పించిన మూడు బంగారు హారాలను సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులకు అలంకరించాలని ఈఓ కె.రామచంద్ర మోహన్ గురువారం ఆదేశించారు. విశాఖపట్నానికి చెందిన భక్తులు గత మంగళవారం రూ.17.5 లక్షల విలువ చేసే మూడు హారాలను సమర్పించిన విషయం విదితమే. వీటిని ఈఓ గురువారం పరిశీలించారు. ఏఈఓ కృష్ణారావు, సూపరింటెండెంట్ అనకాపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా పోటీ చేసి తీరుతా

దీక్ష విరమించిన సూర్యచంద్ర



దీక్ష విరమిస్తున్న సూర్యచంద్ర దంపతులు

గోకవరం: జగ్గంపేట ఎమ్మెల్యే సీటును టీడీపీకి కేటాయించడాన్ని నిరసిస్తూ గోకవరం మండలం అచ్యుతాపురంలో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర దంపతులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను గురువారం సాయంత్రం విరమించారు. సూర్యచంద్ర తల్లి వీరరాఘవమ్మ నిమ్మరసం ఇచ్చి, దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కార్యకర్తలు, అభిమానుల అభీష్టం మేరకు దీక్ష విరమించానని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జగ్గంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి తీరుతానని స్పష్టం చేశారు. సామాన్యుడు అసెంబ్లీకి వెళ్లగలడని నిరూపిస్తానన్నారు. స్వతంత్ర్య అభ్యర్థిగానా లేక ఏ పార్టీ నుంచి అనేది కార్యకర్తల అభీష్టం మేరకు త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

విద్యార్థీ.. విజయోస్తు

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి
- జిల్లావ్యాప్తంగా 59 కేంద్రాల్లో నిర్వహణ
- నో సెల్‌ఫోన్ జోన్లుగా పరీక్ష కేంద్రాలు
- 144 సెక్షన్ అమలు



సాక్షి, రాజమహేంద్రవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంటర్మీడియెట్ పరీక్షలు నేడు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను పక్కాగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. శుక్రవారం ప్రథమ, శనివారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు మొదలవుతాయి. ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు, ఇతర మెటీరియల్‌ను ఇప్పటికే పోలీసు బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూములకు అధికారులు తరలించారు. పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

పక్కాగా ఏర్పాట్లు

ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 59 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 22,059 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 22,120 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించామని జిల్లా వృత్తి విద్యా అధికారి జీజీకే నూకరాజు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించారు. మరుగుదొడ్లు అందుబాటులో ఉంచారు. విద్యార్థులు పరీక్షల్లో ఎటువంటి ఇబ్బందీ పడకుండా అవసరమైన ఫర్నిచర్, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బందితో ప్రథమ చికిత్స సేవలు అందుబాటులో ఉంచుతున్నారు.

సీసీ కెమెరాలతో నిఘా

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలో సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నపత్రం రాగానే కెమెరా ముందు ఓపెన్ చేసి, సంబంధిత అధికారులు సంతకాలు చేయాలి. ఆ తర్వాతే విద్యార్థులకు ఇవ్వాలి. ప్రతి కేంద్రానికీ ఇంటర్‌నెట్ సౌకర్యం తప్పనిసరి. సీసీ కెమెరాలను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ఇంటర్ బోర్డు పరిశీలిస్తుంది. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

నిమిషం ఆలస్యమైన 'నో ఎంట్రీ'

ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీగా పరిగణిస్తారు. అందువలన పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సెల్‌ఫోన్లకు అనుమతి 'నో'

ఇంటర్ పరీక్ష కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం నో సెల్‌ఫోన్ జోన్లుగా ప్రకటించింది. విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, స్క్వాడ్‌లు, చివరకు తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రం బయటనే ఉంచాలని నిబంధన విధించింది. పరీక్షల నిర్వహణలో సందేహాలు, అధికారులకు సమాచారం, ఇతర అవసరాల నిమిత్తం ప్రతి కేంద్రానికి కేవలం ఒక్కటి చొప్పున కీప్యాడ్ ఫోన్లను అనుమతిస్తారు. ఇవి సీఎస్‌ల పర్యవేక్షణలో ఉంటాయి.

'ప్రైవేటు' వేధింపులకు కళ్లెం

పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై జులుం ప్రదర్శించేవి. పూర్తి ఫీజు చెల్లిస్తేనే కానీ హాల్‌టికెట్ ఇవ్వబోమని బెదిరించేవి. తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ఫీజులు చెల్లించేవారు. దీనిపై గతంలో అనేకసార్లు ఆందోళనలు చోటు చేసుకునేవి. ఫిర్యాదులు వచ్చేవి. ఈ ఇబ్బందిని తొలగించాలన్న తలంపుతో ప్రభుత్వం నేరుగా ఆన్‌లైన్‌లోనే హాల్ టికెట్ పొందే సౌలభ్యం కల్పించింది. గతంలో 75 శాతం పైగా హాజరు ఉన్న విద్యార్థుల హాల్ టికెట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేవి. హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థులు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌కు కాండోనేషన్ ఫీజు చెల్లించాల్సి వచ్చేది. ఈ ఏడాది దానిని కూడా పూర్తిగా రద్దు చేశారు. ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థీ పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశారు.

ఫిర్యాదులకు కంట్రోల్ రూము

పరీక్షలకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదులకు రాజమహేంద్రవరంలోని ఇంటర్మీడియెట్ బోర్డ్ ప్రాంతీయ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా 0833-2473430, 949222 6232 నంబర్లలో సంప్రదించవచ్చు. దీనికోసం ప్రిన్సిపాల్ స్థాయి అధికారిని, సిబ్బందిని నియమించారు.

సర్వం సిద్ధం



ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటున్నాం. మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నాం. భద్రత కట్టుదిట్టం చేస్తున్నాం. సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశాం. పారదర్శకంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం.

– నరసింహం, ఇంటర్మీడియెట్ బోర్డ్ ప్రాంతీయ అధికారి, రాజమహేంద్రవరం

చదువుకోవాలని దీవెన

- నేడు జగనన్న విద్యా దీవెన విడుదల
- జిల్లాలో 41,474 మందికి ప్రయోజనం
- 37,136 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.28.84 కోట్ల జమ

కాకినాడ సిటీ: పేద విద్యార్థుల ఉన్నత చదువుల బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంది. ఇందులో భాగంగా జగనన్న విద్యాదీవెన పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. తద్వారా తమ పిల్లలను పెద్ద చదువులు చదివించాలనే తల్లిదండ్రుల కోరికను నెరవేరుస్తోంది. ఈ ఏడాది జగనన్న విద్యా దీవెన పథకం మొదటి విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లా పామర్రులో శుక్రవారం బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. ఆ వెంటనే సంబంధిత విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు జమ కానున్నాయి. గతంలో వివిధ కారణాలతో అర్హత కోల్పోయిన విద్యార్థులకు కూడా ఈ విడతలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాయి. గ్రామ/వార్డు సచివాలయాల్లో విద్యాదీవెన కింద అర్హత సాధించిన, అర్హత సాధించలేకపోయిన విద్యార్థుల జాబితాలను ప్రదర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాల మేరకు పలువురు విద్యార్థులు వారి తల్లుల ఆథెంటికేషన్ వేసి ఇప్పటి వరకూ అర్హులు కాగలిగారు. ఈ పథకానికి జిల్లాలో 41,474 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వారికి సంబంధించిన 37,136 మంది తల్లుల ఖాతాల్లో



సామాజికవర్గాల వారీగా జగనన్న విద్యా దీవెన ఇలా..

సామాజికవర్గం	విద్యార్థులు	తల్లులు	లబ్ధి (రూ.లు)
ఎస్సీ	6,171	5,611	4,05,14,906
ఎస్టీ	282	264	16,40,492
బీసీ	19,355	17,336	13,04,95,660
ఈబీసీ	2,695	2,483	2,27,37,944
ముస్లింలు	574	519	41,59,344
కాపు	12,276	10,930	8,79,23,275
క్రిస్టియన్	121	106	9,64,672

రూ.28,84,36,178 జగనన్న విద్యా దీవెన నిధులు జమ చేసేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, ఎంబీబీఎస్, నర్సింగ్ తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం వరం కానుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. మొదటి క్వార్టర్ నగదు విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమవుతుంది. ఈ డబ్బును ఫీజు కింద విద్యార్థి చదువుతున్న కాలేజీల్లో చెల్లించాలి. కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు చేపడతాం.

– వై.వాణి, ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ, కాకినాడ



జగనన్న విద్యా దీవెన నమూనా చెక్‌ను విద్యార్థులకు అందిస్తున్న మంత్రి వేణు, కలెక్టర్ కృతికా శుక్లా (పాతచిత్రం)

రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తిదాయకం

- జేసీ ప్రవీణ్ ఆదిత్య
- 'ప్రాణమిత్ర'లకు సర్టిఫికెట్ల ప్రదానం



ప్రాణమిత్ర వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య, కమిషనర్ వెంకటరావు తదితరులు

కాకినాడ: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే సత్సంకల్పంతో రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన రక్షణ చర్యలపై సుమారు 850 మంది సచివాలయ ఉద్యోగులకు 'రెడ్‌క్రాస్ ప్రాణ మిత్ర వలంటీర్స్' పేరిట ఓఎన్‌జీసీ సహకారంతో మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగిన సమయాల్లో ప్రాణ, ఆస్తినష్టం నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాకినాడ రూరల్, సిటీ, తాళ్లరేవు, తుని, ఉప్పాడ కొత్తపల్లి సహా వివిధ ప్రాంతాల్లోని సచివాలయ ఉద్యోగులు శిక్షణ పొందారు. అనంతరం వారికి స్మార్ట్‌సిటీ కార్యాలయంలో గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలనే దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మాట్లాడుతూ, ప్రాణమిత్ర వలంటీర్ల పేరిట ఇచ్చిన శిక్షణ ఆపద సమయంలో ఎంతో మందికి అండగా నిలుస్తుందని అన్నారు. రెడ్‌క్రాస్ వినతి మేరకు త్వరలోనే రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఓఎన్‌జీసీ ఈడీ అనుపమ్ మాట్లాడుతూ, రెడ్‌క్రాస్ సంస్థకు తమ తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ, రక్తదాన శిబిరాలతో పాటు, వృద్ధాశ్రమాల నిర్వహణ సహా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రాష్ట్రపతి గోల్డ్ మెడల్ కూడా పొందామని చెప్పారు. రెడ్‌క్రాస్ సేవల్లో జిల్లా ఏపీలోనే ప్రథమంగా నిలిచిందని తెలిపారు.

70 తోపుడు బళ్ల అందజేత

కాకినాడ నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగానికి రూ.10 లక్షల వ్యయంతో 70 తోపుడుబళ్లను ఓఎన్‌జీసీ సమకూర్చింది. వీటిని జేసీ ప్రవీణ్ ఆదిత్య నగరపాలక సంస్థకు అందజేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ పాలనే చంద్రబాబు అజెండా

- ప్రజలకు మంచి చేయడమే జగన్ అజెండా
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- టీడీపీకి బై చెప్పిన 150 కుటుంబాలు
- మాజీ సర్పంచ్ హరిబాబుతో వైఎస్సార్ సీపీలో చేరిక



మాజీ సర్పంచ్ హరిబాబు తదితరులను వైఎస్సార్ సీపీలోకి స్వాగతిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: నలభై ఏళ్ల అనుభవం అంటున్న చంద్రబాబు ప్రజలను దోపిడీ చేయడమే అజెండాగా పాలన సాగించారని, దీనికి భిన్నంగా వైఎస్సార్ ఆశయ సాధన కోసం ప్రజలకు మంచి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తొండంగి మండలం దానవాయిపేటలో మాజీ సర్పంచ్ చొక్కా హరిబాబు, నాయకులు కోడా సింహాచలం, కోడా బంగారి, మరో 150 కుటుంబాల వారు టీడీపీ నుంచి గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి రాజా పార్టీ కండువాలు వేసి సాదరంగా స్వాగతం పలికారు. వారందరికీ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని చెప్పుకొంటున్న చంద్రబాబు.. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను పీడించి దోపిడీ పాలన సాగించారని అన్నారు. కనీసం వృద్ధులకు పింఛన్లు కూడా అందించలేదన్నారు. టీడీపీ నేతలందరూ కలసి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన మరుగుదొడ్ల నిర్మాణాల్లో అమాయక ప్రజల పేరిట కోట్లాది రూపాయలు లూటీ చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కుల, మత, జాతి, రాజకీయ విభేదాలు లేకుండా అందరికీ సంక్షేమం అందించిందని చెప్పారు. మత్స్యకార గ్రామమైన దానవాయిపేట అభివృద్ధికి 30 ఏళ్లు పాలించిన యనమల సోదరులు చేసిన కృషి శూన్యమన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఒక్క పంచాయతీలోనే సంక్షేమ పథకాల ద్వారా సీఎం జగన్ రూ.28 కోట్ల లబ్ధి ఇంటి వద్దనే అందించారని తెలిపారు. అలాగే, మత్స్యకారులకు మత్స్యకార భరోసాతో పాటు మత్స్యకార బీమా, డీజిల్ రాయితీ పెంపు తదితర సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. సీఎం జగన్ నేతృత్వంలో దేశంలోనే ఆదర్శవంతమైన సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ సీపీని వచ్చే ఎన్నికల్లో మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మంత్రి రాజా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, ఏలేరు రిజర్వాయర్ డైరెక్టర్ తోలాడ శైలాపార్వతి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి మడదా హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు 'ప్రసాద్'

- ఊరించి ఊరించి అన్నవరానికి రూ.20 కోట్ల మంజూరు
- ఈ నిధులతో పలు నిర్మాణాలు
- 7న వర్చువల్‌గా ప్రధాని శంకుస్థాపన



అన్నవరం: ఊరించి ఊరించి ఎట్టకేలకు అన్నవరం దేవస్థానానికి కేంద్ర ప్రభుత్వం పిలిగ్రిమేజ్ రీజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) మంజూరు చేసింది. చివరకు రూ.20 కోట్లు అందించడానికి సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర పర్యాటక శాఖ నుంచి రాష్ట్ర పర్యాటక శాఖకు గురువారం రాత్రి సమాచారం వచ్చింది. రెండు మూడు రోజుల్లో జీఓ విడుదల కానుంది. ఈ నిధులతో రత్నగిరిపై టీటీడీ కల్యాణ మండపం స్థలంలో మూడంతస్తుల అన్నదాన భవనం, సత్యదేవుని ఆలయ సమీపంలో విశాలమైన క్యూ కాంప్లెక్స్, టాయిలెట్ బ్లాక్ నిర్మించనున్నారు. వీటికి ఢిల్లీలోని తన కార్యాలయం నుంచి ప్రధాని నరేంద్ర మోదీ మార్చి 7న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ మార్చి రెండో వారంలో రావచ్చని భావిస్తున్న నేపథ్యంలో హడావుడిగా ప్రసాద్ స్కీమ్ నిధులు మంజూరు చేసినట్లు సమాచారం.

రూ.20 కోట్లకు కుదింపు

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం 2014లో అధికారంలో వచ్చిన తరువాత దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రసాద్ స్కీమును రూపొందించిన విషయం తెలిసిందే. తొలి దశలో ఉత్తరాది రాష్ట్రాల్లోని వారణాసి, మధుర తదితర పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేశారు. రెండో దశ కింద 2016లో అన్నవరం దేవస్థానాన్ని కూడా ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై నాలుగేళ్లుగా కేంద్ర, రాష్ట్ర టూరిజం శాఖల ఉన్నతాధికారులతో కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓలతో దఫదఫాలుగా సమావేశాలు నిర్వహించారు. ఈ నిధులు మంజూరుకు కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డిని కూడా కలిశారు. అనంతరం అన్నవరం దేవస్థానం అభివృద్ధికి ప్రసాద్ స్కీమ్ కింద రూ.54 కోట్లు మంజూరు చేయడానికి కేంద్ర పర్యాటక శాఖ రెండేళ్ల క్రితమే డీపీఆర్ కూడా సిద్ధం చేసింది. ఇంత ప్రయత్నించినా రూ.20 కోట్లు మాత్రమే మంజూరు చేశారు.

ప్రణాళిక ప్రకారం
సాగునీటి పంపిణీ

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం

కాకినాడ సిటీ: రబీలో ప్రణాళికాబద్ధంగా సాగునీరు పంపిణీ చేసి, శివారు భూములకు ఎద్దడి లేకుండా కృషి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. రబీ సాగునీటి పంపిణీ, ఇతర అంశాలపై కలెక్టరేట్‌లో గురువారం ఆమె సమీక్షించారు. జిల్లాలోని గోదావరి, ఏలేరు, పంపా ఆయకట్టు కింద సాగవుతున్న పంటల వివరాలు, సాగునీటి లభ్యత, కాలువల పరిస్థితులపై అధికారులతో చర్చించారు. జిల్లాలో గోదావరి ఆయకట్టు కింద 1.35 లక్షలు, ఏలేరు కింద 53 వేలు, పంపా రిజర్వాయర్ కింద సుమారు 10 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. రబీ సాగుకు రానున్న రెండు నెలలూ అత్యంత కీలకమని, ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ప్రణాళిక ప్రకారం సమన్వయంతో పని చేసి, పంటలకు సాగునీరు అందించాలని అన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలైన తొండంగి, పిఠాపురం, గొల్లప్రోలు, తాళ్లరేవు, పెదపూడి మండలాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇరిగేషన్ శాఖ అనుమతి లేకుండా అనధికారికంగా సాగునీరు వినియోగించడాన్ని నివారించాలని ఆదేశించారు. దీనికోసం మండల, గ్రామ స్థాయిల్లో వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సాగునీటిపై నియంత్రణకు అధికారులు ఎప్పటికప్పుడు కాలువలపై పర్యవేక్షణ చేయాలని, వారాబందీ విధానం, నీటిమట్టం స్థాయిలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో నూరు శాతం ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయిందని, రైతుల నుంచి ఈ-కేవైసీ కూడా పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను కృతికా శుక్లా ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీఓలు ఇట్ల కిశోర్, జె.సీతారామారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్, ధవళేశ్వరం నీటిపారుదల శాఖ ఎస్‌ఈ జి.శ్రీనివాసరావు, పెద్దాపురం ఈఈ డి.రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: వందల సంఖ్యలో నవదంపతులు, వేలాదిగా వచ్చిన భక్తజనంతో రత్నగిరి గురువారం కూడా కిటకిటలాడింది. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున సత్యదేవుని సన్నిధిలో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఇవే ముహూర్తాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వారు కూడా స్వామివారి ఆలయానికి తరలివచ్చారు. ఉదయం 11.30 గంటల ముహూర్తంలో కూడా రత్నగిరిపై వివాహాలు జరిగాయి. ఈ నవదంపతులతో పాటు, వారి బంధుమిత్రులు, ఇతర భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణంలో నవదంపతుల సందడి నెలకొంది. ఆలయ ప్రాంగణం, క్యూ లైన్లు, వ్రత, విశ్రాంత మండపాలు కూడా నవదంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిసిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. రెండు వేల వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ప్రతి గురువారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్టులను సత్యదేవుని నిజరూపంతో దర్శించే అవకాశం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఆభరణాలు లేకుండా తక్కువ పూలమాలలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు.



సత్యదేవుని ఆలయం వద్ద క్యూలో నిల్చున్న భక్తులు

క్లుప్తంగా


తలపై పడితే ప్రమాదమే



బీటలు తీసిన పోతిక

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానంలోని దర్బారు మండపంలో ఒక స్తంభానికి సిమెంట్‌తో రూపొందించిన పోతిక (అలంకరణలో భాగంగా ఏర్పాటు చేసింది) బీటలు తీసింది. అది ఏ క్షణంలోనైనా స్తంభం నుంచి విడిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉంది. దర్బారు మండపంలోని ఉత్సవ మూర్తులను దర్శించుకునేందుకు భక్తులు ఈ స్తంభం కింద నుంచే క్యూలో వెళతారు. గతంలో ఇదే మండపంలో ఇటువంటి పోతిక స్తంభం నుంచి ఊడిపోయి భక్తుల మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



కృష్ణమూర్తి (ఫైల్)

నల్లజర్ల: కుమార్తెను చూడడానికి వెళుతున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అనంతపల్లి టోల్ ప్లాజా దగ్గర గురువారం ఈ ఘటన జరిగింది. నల్లజర్ల ఏఎస్సై మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం రూరల్ మండలం జగ్గన్నపేటకు చెందిన చవల కృష్ణమూర్తి (55) వ్యవసాయ కూలీ. ఆయన గురువారం తన కుమార్తెను చూడటానికి యాదవోలుకు మోటారుసైకిల్‌పై బయలు దేరాడు. అనంతపల్లి టోల్‌ప్లాజా దగ్గరకు వచ్చేసరికి ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తిని హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృత దేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉజ్వల భవితకు వినూత్న బోధన

- పాఠశాలలోనే పారిశ్రామిక, ఆర్థిక పాఠాలు
- తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈఎండీపీ కార్యక్రమం అమలు
- నేడు కొత్తపేటలో ప్రాజెక్టుల ఎక్స్‌పో



తొమ్మిదో తరగతి విద్యార్థులు (ఫైల్)

రాయవరం: విద్యార్థుల వినూత్న ఆలోచనలకు కార్యాచరణ తోడైతే మెరుగైన ఫలితాలు వస్తాయి. అందుకే విద్యార్థి దశ నుంచే పారిశ్రామిక ఆలోచనలు కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో 'వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి' అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేసింది. పారిశ్రామిక, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ)ను అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు నేర్చుకున్న పారిశ్రామిక, ఆర్థిక అక్షరాస్యతపై వారికి ఏ మేరకు అవగాహన కలిగిందో తెలుసుకునేందుకు కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రాజెక్టుల ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు ఈఎండీపీ ఎక్స్‌పోను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు ప్రారంభిస్తారు.

జిల్లాలో 13,517 మంది విద్యార్థులు

జిల్లాలోని 224 ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న 13,517 మంది విద్యార్థులకు ఈఎండీపీ పాఠాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం తొమ్మిదో తరగతి బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు. ఈ ఉపాధ్యాయులు ప్రతి శుక్రవారం విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత బోధనలో భాగంగా బడ్జెట్, పొదుపు, ఖర్చు తదితర అంశాలపై చైతన్యం కలిగించారు. సాంకేతికత, ఇతర ఉత్పత్తులను పరిచయం చేశారు. మొత్తం 18 అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఒక్కో విద్యార్థి ఐదేసి ప్రాజెక్టులను రూపొందించాలి. జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో 87 పాఠశాలలకు చెందిన 487 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేశారు. వీటి నుంచి పది ఉత్తమ ప్రాజెక్టులను జిల్లాస్థాయి ఎక్స్‌పోకు ఎంపిక చేశారు.

జిల్లా కమిటీ ఏర్పాటు

జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమల కుమారి పర్యవేక్షణలో జిల్లా సైన్స్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈఎండీపీ ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శించే ప్రాజెక్టుల్లో రెండింటిని రాష్ట్ర స్థాయికి జిల్లా కమిటీ ఎంపిక చేయాల్సి ఉంది. ఇందుకోసం రామచంద్రపురం డీవైఈవో, జిల్లా సైన్స్ అధికారి, డీసీఈబీ కార్యదర్శి, బొమ్మూరు డైట్ లెక్చరర్ కేవీ సూర్యనారాయణ, ఈఎండీపీ జోనల్ మేనేజర్ వై.నవ్య, సమగ్ర శిక్షా ఏఎంవోతో కమిటీని ఏర్పాటు చేశారు.

ఎక్స్‌పోలో ప్రాజెక్టులు ప్రదర్శించనున్న పాఠశాలలు

- కపిలేశ్వరపురం మండలం కాలేరు జెడ్పీహెచ్ఎస్ (ఆటోమేటిక్ డ్రైనేజ్ క్లీనర్)
- అమలాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (ఎమర్జెన్సీ నేప్‌కిన్ బాక్స్)
- ఆత్రేయపురం మండలం ఉచ్చిలి జెడ్పీ ఉన్నత పాఠశాల (లైఫ్ సేవర్ స్టిక్ ఫర్ స్నేక్ బైట్స్)
- ముమ్మిడివరం మండలం అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బోన్సాయ్ నర్సరీ ప్లాంట్)
- అమలాపురం మండలం పాలగుమ్మి జెడ్పీ హెచ్ఎస్ (కోనసీమ టూర్స్ యాప్)
- అమలాపురం మండలం జనుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల (ఫెర్టిలైజర్ బైయూజింగ్ ఎగ్‌సెల్)
- కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బ్లైండ్ గ్లాస్)
- మండపేట శ్రీ గౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాల (హోమ్ సర్వీస్ ఎక్స్‌పర్ట్)
- అంబాజీపేట మండలం జి.అగ్రహారం జెడ్పీ ఉన్నత పాఠశాల (రీసైక్లింగ్ ఆఫ్ టెండర్ కోకోనట్)
- కపిలేశ్వరపురం మండలం టేకి జెడ్పీ ఉన్నత పాఠశాల (సాంబ్రాణి ఎరాడికేటింగ్ మస్కిటోస్).

భవితకు చక్కని పునాది



తొమ్మిదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు ఈఎండీపీ చక్కని పునాది అని చెప్పవచ్చు. మాడ్యూల్స్ మార్గదర్శకాలకు అనుగుణంగా బోధన జరుగుతుంది. భవిష్యత్తు అవకాశాలను ముందే ఊహించడం ద్వారా జీవితంలో నిలదొక్కుకునే వీలుంది. విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకుంటున్నారు.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం.

ఆలోచనలకు పదును



తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈఎండీపీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశాం. విద్యార్థుల్లో ఉన్న ఆలోచనలకు పదును పెట్టేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. విద్యార్థులు వినూత్న ఆలోచనలకు ఇది వేదికగా నిలుస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

– వై.నవ్య, ఈఎండీపీ జోనల్ మేనేజర్, అమలాపురం.

అన్ని చర్యలూ తీసుకున్నాం



ఈఎండీపీ ఎక్స్‌పోను విజయవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. జిల్లాలో పది ఉత్తమ ప్రాజెక్టులను జిల్లా స్థాయి ఎక్స్‌పోలో విద్యార్థులు ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వం ప్రథమ్ సంస్థతో కలిపి గతేడాది నుంచి ఈఎండీపీ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పది ప్రాజెక్టుల నుంచి రాష్ట్రానికి రెండు ప్రాజెక్టులు పంపించడం జరుగుతుంది.

– జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

12 కాసుల ఆభరణాలు చోరీ

కొవ్వూరు: పట్టణంలోని రాజీవ్ కాలనీకి చెందిన దుబా మణి ఇంట్లో దొంగలు చొరబడి సుమారు 12 కాసుల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మణి వంట పనిచేస్తుంది. ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి ఇంటికి తాళాలు వేసి డ్యూటీకి వెళ్లింది. తిరిగి 29వ తేదీ ఉదయం వచ్చే చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని 12 కాసుల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. వాటిలో మూడు గొలుసులు, ఒక నక్లెస్, జత గాజులు, ఆరు చెవులీలు, నాలుగు ఉంగరాలు ఉన్నట్టు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై జుబైర్ మహ్మద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురికి జైలు శిక్ష, జరిమానా

జగ్గంపేట: స్థానిక సర్కిల్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి పెద్దాపురం కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించినట్లు సీఐ లక్ష్మణరావు గురువారం తెలిపారు. వారిపై ఫిబ్రవరిలో కేసులు నమోదు చేశామన్నారు. గురువారం కోర్టుకు హాజరుపరచగా వారిలో నలుగురికి మూడు రోజుల చొప్పున జైలుశిక్ష, మరో ముగ్గురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారన్నారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం

కొవ్వూరు: వాడపల్లి శివాలయం రేవు సమీపంలో గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం పోలీసులు గుర్తించారు. అతడి వయసు సుమారు 40 నుంచి 50 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. అతడు వారం రోజుల క్రితం మృతి చెందిన ఉంటాడని ఏఎస్సై జీజీ ప్రకాష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి వద్ద ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదని, వివరాల కోసం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

పెళ్లి రోజే భార్య దారుణ హత్య

- అనుమానంతో నరికి చంపిన భర్త
- కాకినాడలో దారుణం



దివ్య (ఫైల్)



రక్తపు మడుగులో దివ్య మృతదేహం

కాకినాడ క్రైం: వారు ఏడడుగులు నడిచి సరిగా ఏడేళ్లు పూర్తయ్యింది. లీప్ సంవత్సరంలో పెళ్లి జరగడంతో ఇది రెండో రోజు. అటువంటి ప్రత్యేక సమయంలో భార్యపై ఆ భర్త కిరాతకంగా దాడి చేశాడు. అనుమానంతో కత్తితో నరికి చంపేశాడు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ పప్పుల మిల్లు సమీపంలోని శ్రీరామ్ నగర్‌లో బొందల దివ్య(26) భర్త నూకరాజు, ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తోంది. నూకరాజు రేకులషెడ్ ఫ్యాబ్రికేషన్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడికి భార్యపై అనుమానం ఉండేది. ఈ కారణంతో తరచూ వేధించేవాడు. భార్యతో అకారణంగా గొడవ పెట్టుకోవడం, ఎన్నోసార్లు దాడి చేయడం మామూలు విషయంగా మారింది. ఈ నేపథ్యంలో గురువారం వారి పెళ్లి రోజు. ఉదయం బయటికి వెళ్లి మధ్యాహ్నానికి నూకరాజు ఇంటికి వచ్చాడు. రావడంతోనే భార్యను విచక్షణా రహితంగా కొట్టాడు. ఆ దెబ్బలను తాళలేక దివ్య ఇంటి నుంచి బయటికి పరిగెట్టబోయింది. అప్పటికే తెచ్చి దాచుకున్న కత్తితో ఆమె మెడపై విచక్షణా రహితంగా నరికాడు. రెండే రెండు వేట్లతో దివ్య కుప్పకూలింది. మెడ భాగం నుంచి తల వేరుపడింది. ఘటనా స్థలాన్ని వన్ టౌన్ సీఐ సురేష్ బాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

కాకినాడ సిటీ: జిల్లాలో లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు గురువారం విస్తృత దాడులు నిర్వహించారు. నాలుగు బృందాలుగా ఏర్పడి ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్, బియ్యం, ఇనుము, స్టీల్, కూల్‌డ్రింక్స్, తినుబండారాలు విక్రయించే దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ చట్టం–2009 నియమావళిని ఉల్లంగించిన వారిపై 20 కేసులు నమోదు చేశారు. తక్కువ తూకంతో ఇనుము (ఐరన్ అండ్ స్టీల్) అమ్ముతున్న వారిపై ఒక కేసు, తక్కువ తూకం గల బియ్యం బస్తాలు అమ్ముతున్నందు ఒక కేసు, ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు కూల్ డ్రింక్స్ అమ్ముతున్న వారిపై రెండు కేసులు, అమ్మకపు ధర, తయారు తేదీ, తయారుదారుని చిరునామా వివరాలు లేనందున 13 కేసులు, ముద్రలు లేని ఎలక్ట్రానిక్ కాటాలు వినియోగిస్తున్నందుకు మూడు కేసులు నమోదు చేసినట్లు ఉప నియంత్రికులు ఎస్.జనార్దనరావు తెలిపారు. కాకినాడ, పెద్దాపురం ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, పెద మార్కెట్, చిన్న మార్కెట్, జగన్నాథపురం, నాగమల్లితోట, సర్పవరం, రమణయ్యపేట, అచ్చంపేట జంక్షన్లలో ఈ దాడులు నిర్వహించామన్నారు. లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు శామ్యూల్ రాజు, సలీమ్, సరోజని, ప్రసాద్, శివ బాలాజీ, కుటుంబరావు, నాగేంద్రకుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఇటువంటి అవకతవకలు జరిగితే లీగల్ మెట్రోలజీ శాఖ హెల్ప్‌లైన్ నంబర్ 1967కు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

ఏసీబీ కేసులో నిందితుడికి జైలు

రాజమహేంద్రవరం రూరల్: ఏసీబీ కేసులో ముద్దాయి జాన్ కెన్నడి రాజ్‌కుమార్‌కు జైలుశిక్ష విధిస్తూ ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలలు పాటు సాధారణ జైలుశిక్ష విధించారు. అలాగే మరో సెక్షన్ ప్రకారం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష ,రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.ఆ జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయబడతాయన్నారు. వివరాల్లోకి వెళితే.. ముద్దాయి జాన్ కెన్నడి రాజ్‌కుమార్ కాకినాడ ఏపీ స్టేట్ సివిల్ సప్లయి కార్పొరేషన్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్ (జనరల్)గా పనిచేసేవాడు. ఆలమూరు మండలం పెనికేరు గ్రామానికి చెందిన వైట్ల వెంకట్రావుకు మండపేట నుంచి నిత్యావసర వస్తువుల రవాణా కోసం వర్క్ ఆర్డర్ జారీ చేసి, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాల్లో గల దుకాణాలకు తరలించుటకు లంచం అడిగాడు. దీంతో 2016 సెప్టెంబర్‌న వెంకటరావు నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత



పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన రామకృష్ణ

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలో ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆ గ్రామ శివారున ఉన్న ఖాళీ స్థలంలో ఇటీవల కొందరు పాకలు వేసుకున్నారు. వాటిని తొలగించేందుకు రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయంతో గురువారం చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అక్కడ పాక నిర్మించుకున్న పిల్లి రామకృష్ణ తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే పోలీసులు అతడిని అడ్డుకున్నారు. రామకృష్ణ మాట్లాడుతూ భార్య, ఇద్దరు పిల్లలతో నిలువనీడ లేకుండా ఉన్నానని, తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని వేడుకున్నాడు. దీనిపై వీఆర్వో చంద్రకాంతాన్ని సంప్రదించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణల తొలగింపు చేపట్టామన్నారు.

అన్నవరం దేవస్థానం ప్రతిష్టను మరింత పెంచాలి


ఉద్యోగ సంఘ నాయకులకు చైర్మన్, ఈఓ అభినందనలు



దేవస్థానం చైర్మన్ రోహిత్‌ను సత్కరిస్తున్న సంఘ నాయకులు

అన్నవరం: దేవస్థానం ప్రతిష్టను మరింత పెంచేందుకు నూతన ఉద్యోగుల సంఘం నాయకులు కృషి చేయాలని అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ కోరారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బుద్దరాజు సత్యనారాయణరాజు (బీఎస్ఎన్ రాజు), ఇతర కార్యవర్గ సభ్యులు గురువారం వారిని మర్యాద పూర్వకంగా సత్కరించారు. అనంతరం ఉద్యోగుల సంఘం నాయకులను చైర్మన్, ఈఓ అభినందించారు. సంఘం గౌరవాధ్యక్షులు డీవీఎస్ కృష్ణారావు, పి.కృష్ణప్రసాద్, టి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కంచిబట్ల రామ్‌కుమార్, అనకాపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.సత్యశ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ జగన్నాథం, ఎంఎల్ గణపతిరావు, కోశాధికారి పి.తలుపులయ్య, డీఈ బీఎస్ రాంబాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రైజర్ గ్యాస్ నుంచి మంటలు



గొల్లపాలెంలో ఎగసి పడుతున్న మంటలు

మలికిపురం: గొల్లపాలెంలోని తూర్పుపాలెం గ్యాస్ గేథరింగ్ స్టేషన్‌లో ప్రైజర్ గ్యాస్‌ను మండించే పైపు వద్ద మంటలు గురువారం ఉధృతమయ్యాయి. గ్యాస్‌ను ఇతర ప్రాంతాలకు తరలించే క్రమంలో బ్యాలెన్స్ నిర్వహణలో భాగంగా ప్రైజర్ గ్యాస్‌ను గాలిలో వదిలి మండిస్తారు. ఈ క్రమంలో గురువారం మంటలు ఎక్కువగా వచ్చాయి. ఇది సాధారణ విషయమేనని సైట్ అధికార వర్గాలు తెలిపాయి.

యువకుడి దుర్మరణం



అంజిబాబు మృతదేహం

గోపాలపురం: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. గోపాలపురం ఎస్సై కర్రి సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగల్తూరు మండలం కొత్తకోట గ్రామానికి చెందిన ఏనుగు అంజిబాబు (30) తన మోటార్ సైకిల్‌పై తాడేపల్లిగూడెం నుంచి కొయ్యలగూడెంలో తన స్నేహితుడి ఇంటికి వచ్చాడు. తిరిగి రాత్రి సమయంలో తన స్వగ్రామం కొత్తకోటకు వెళుతుండగా జాతీయ రహదారిపై గోపాలపురం పెట్రోల్‌బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో అంజిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి తండ్రి చక్రపాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాదగయ మహాశివరాత్రి ఉత్సవ నిర్వహణ కమిటీ నియామకం

పిఠాపురం: దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పాదగయ క్షేత్రానికి మహా శివరాత్రి ఉత్సవ నిర్వహణ కమిటీ గురువారం నియమించారు. ఈ విషయంపై ఇటీవల కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీతను పాలక వర్గ సభ్యులు కలిశారు. ఆమె వెంటనే స్పందించి దేవదాయ ధర్మాదాయ అధికారులతో చర్చించి, ఈ కమిటీ నియామకానికి చర్యలు తీసుకున్నారు. కమిటీ సభ్యులుగా ఆగంటి ప్రభాకరరావు, దంగేటి ఆదినారాయణ, మేడిశెట్టి ఉమా మహేశ్వరావు, గ్రంధి వెంకట గణేష్, పిల్లా శ్రీనివాసరావు, వడిశెట్టి గాయత్రి, బండి శారద, కొసిరెడ్డి సత్యనారాయణ, నల్లమిల్లి ముత్యాలరావు నియమితులయ్యారు.

వ్రత పురోహితులకు మెరుగైన ఆరోగ్య సేవలు

- తక్కువ ప్రీమియంతో అందించే కంపెనీతో బీమా చేయించండి
- ఆదేశాలు జారీ చేసిన ఈఓ రామచంద్ర మోహన్



రామచంద్రమోహన్, ఈఓ



దేవస్థానంలో వ్రతాలు నిర్వహిస్తున్న పురోహితులు (ఫైల్)

అన్నవరం: దేవస్థానంలో పనిచేస్తున్న 260 మంది వ్రతపురోహితుల హెల్త్ ఇన్స్యూరెన్స్‌కు సంబంధించి తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఆరోగ్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చే కంపెనీతో బీమా చేయించాలని ఈఓ కె.రామచంద్రమోహన్ సంబంధిత అధికారులను గురువారం ఆదేశించారు. మూడు, నాలుగు కంపెనీల కొటేషన్లు తీసుకుని, తక్కువ ప్రీమియంతో వైద్యసేవలు అందించే వారికి ఎంపిక చేయాలన్నారు. ప్రతి సంవత్సరం దేవస్థానం వ్రత పురోహితుల పారితోషకం రిజర్వ్ నిధులతో హెల్త్ ఇన్స్యూరెన్స్ చేయిస్తున్నారు. గతంలో మూడేళ్లు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో మణిపాల్ సిగ్మా కంపెనీతో బీమా చేయించారు. 2021 – 22లో రూ.15 లక్షల ప్రీమియంతో ప్రతి పురోహితుడికి రూ.మూడు లక్షల వైద్య ఖర్చులు ఆసుపత్రికి చెల్లించేలా, ఆసుపత్రి నుంచి డిస్చార్జ్ అయ్యాక మరో రూ.మూడు లక్షలు బఫర్ ఫండ్ నుంచి కంపెనీ చెల్లించేలా ఒప్పందం కుదిరింది. 2023 – 24 సంవత్సరానికి రూ.35 లక్షల ప్రీమియం చెల్లించి వ్రత పురోహితుడితో పాటు అతడి భార్యకు కూడా రూ.ఆరు లక్షల వరకూ వైద్య ఖర్చులు భరించేలా ఇన్స్యూరెన్స్ కంపెనీతో ఒప్పందం చేస్తున్నారు. ఆ ఒప్పందం ఈ ఏడాది ఫిబ్రవరి 14తో ముగిసింది. అయితే 2024–25కి పాత బీమా కంపెనీకి కాకుండా మరో కంపెనీకి రూ.38 లక్షల ప్రీమియం చెల్లించేలా రూ.ఆరు లక్షల వరకు పురోహితుడు, అతడి భార్యకు వైద్య ఖర్చులు భరించేలా ఒప్పందం చేసుకుని ఆ మేరకు పురోహితుల నిధి నుంచి నగదు చెల్లించేందుకు ఈఓకు గురువారం ప్రతిపాదనలు సమర్పించారు. పరిశీలించిన ఈఓ.. ఈ ప్రీమియం ఇంకా తగ్గే అవకాశం ఉంటుందని, మూడు, నాలుగు కంపెనీల నుంచి కొటేషన్లు తీసుకోవాలని ఆదేశించారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు పరీక్షల సమయంలో ఏ విధమైన ఒత్తిడి లేకుండా చూసుకోవాలని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు సూచించారు. తిరుమల విద్యాసంస్థల ఆవరణలో గురువారం ఆ తరగతుల విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. శుక్రవారం ఇంటర్, ఈనెల 18 నుంచి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తిరుమలరావు మాట్లాడుతూ పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. గతేడాది పదో తరగతి, ఇంటర్ ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. డైరెక్టర్ నున్న సరోజినిదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

అమలాపురం రూరల్: వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి దూసుకెళ్లిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అమలాపురం వైపు వెళుతున్న ఓ కారు గురువారం బంగారులంకలో అదుపు తప్పి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ పక్క నుంచి దూసుకుపోయింది. ఈ ఘటనలో మోటారు సైకిల్‌పై వస్తున్న ఆదుర్తి వెంకట ఆదిత్య, తోపుడు బండి యజమాని గుబ్బల గంగాధరరావు, పాఠశాల ఆయా కుక్కల కుమారికి గాయాలయ్యాయి. వారికి అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో విద్యార్థులు పాఠశాల బయట లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనపై ఏఎస్సై ఏడుకొండలు కేసు నమోదు చేశారు.